సాక్షి
ఆదిలాబాద్

గురువారం । 29 । జూన్ । 2023



త్యాగానికి ప్రతీక బక్రీద్

నేడు బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు జిల్లాలోని మసీదులు, ఈద్గాలు ముస్తాబయ్యాయి. జిల్లాకేంద్రంలోని ఈద్గా వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే రామన్న పరిశీలించారు. 8లో▸

దరఖాస్తు చేసుకోండి

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం కాగా, జూలై 17 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సొనాల మండలం ఏర్పాటు చేయాలని వినతి



మంత్రి కేటీఆర్‌తో ఎంపీపీ శ్రీనివాస్

బోథ్: సొనాల గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కోరారు. ఈ మేరకు మంత్రిని మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో కలిసి విన్నవించగా, సానుకూలంగా స్పందించినట్లు ఎంపీపీ తెలిపారు.

అక్రమ డెప్యుటేషన్లు రద్దు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన ఉపాధ్యాయుల అక్రమ డెప్యుటేషన్లు రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్ ప్రకటనలో డిమాండ్ చేశారు. క్రీడా పాఠశాలలో డెప్యుటేషన్ కోసం ఆసక్తి కలిగి, ఆ పాఠశాలలో అదనంగా ఉన్న ఉపాధ్యాయులు సంబంధిత ఎంఈవో, ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్లో అర్హులను కాదని కొంత మంది అనర్హులకు అవకాశం కల్పించారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నియమించిన ఉపాధ్యాయుల డెప్యుటేషన్లు వెంటనే రద్దు చేసి అర్హులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

'రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే..'



కేంద్ర పథకాలను వివరిస్తున్న శంకర్

ఆదిలాబాద్: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 5, 48, 49 వార్డుల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో నాయకులు రత్నాకర్‌రెడ్డి, ఆదినాథ్, రవి, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని తాటిగూడ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి



నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగులు తమ ఆందోళన ఉధృతం చేశారు. ఇందులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్రాన్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే జోగు రామన్న గతంలో దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. 44 రోజులుగా కలెక్టరేట్ ఎదుట దీక్ష కొనసాగిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

'రేషన్‌కార్డుల జారీపై అసత్య ప్రచారం'

కైలాస్‌నగర్: కొత్త రేషన్‌కార్డుల జారీ అంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. కార్డుల జారీపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు వచ్చినా మీడియా ద్వారా ప్రజలకు తెలియజేస్తామని తెలిపారు.



ఇక్కడ కనిపిస్తున్న మహిళ పేరు కవిత. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో తన ఓపెన్ ప్లాట్ ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరో చోటికి షిఫ్ట్ చేయాలని విద్యుత్ శాఖకు గత మార్చిలో అంచనా వ్యయం రూపొందించిన తర్వాత రూ.2.90 లక్షల డీడీ కట్టింది. ట్రాన్స్‌ఫార్మర్ మరో చోట పెట్టే స్థలాన్ని కూడా ఎంపిక చేశారు. అయితే దాన్ని షిఫ్ట్ చేయడంలో ఆ శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారు. వారిని కలిసినా పని కావడం లేదు. చెయ్యి తడిపితేనే పని య్యేలా ఉందనే భావనకు తీసుకొచ్చారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఇల్లు జిల్లా కేంద్రంలోని రాంపూర్(ఆర్) కాలనీలోనిది. రిటైర్డ్ ఉద్యోగి విఠల్ గతేదాది కొత్త ఇల్లు నిర్మాణం చేశారు. మొదట్లో ఒక విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోగా, దాన్ని శాఖ సిబ్బంది బిగించారు. ఇంట్లో పోర్షన్లు అద్దెకు ఇచ్చే పరిస్థితి ఉండడంతో మరో మూడు మీటర్లు బిగించే అవసరం ఏర్పడింది. ఇందు కోసం గతేదాది డిసెంబర్‌లో మీసేవ ద్వారా ఒక్కో మీటర్‌కు రూ.1,690 చొప్పున విద్యుత్ శాఖకు చెల్లించాడు. తర్వాత సంబంధిత ఏఈని ఈ మీటర్లు ఏర్పాటు చేయాలని కోరగా, వారు పట్టించుకోవడం లేదు. ఎస్ఈని సైతం ఆశ్రయించినా పని కాకపోవడం గమనార్హం. తనకు పరిచయం ఉండడంతో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ద్వారా సంబంధిత అధికారులకు ఫోన్ చేయించినా పట్టించుకోలేదు. సమాచార హక్కు చట్టం ద్వారా ఆదిలాబాద్ డీఈ, ఎస్ఈ, వరంగల్ అధికారులను కోరినా సమాధానం రాలేదు. ఈ క్రమంలో హైదరాబాద్ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. త్వరలోనే సమాధానం చెబుతామని అక్కడి నుంచి మొబైల్‌కు మెసేజ్ వచ్చింది.

డోంట్ కేర్!



జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం

- విద్యుత్ శాఖలో బరితెగింపు
- ఏ పనికైనా చెయ్యి తడపాల్సిందే.. లేకుంటే అంతే
- అధికారులకు చెప్పినా.. ప్రజాప్రతినిధులతో చెప్పించినా నో యూస్

సాక్షి,ఆదిలాబాద్: విద్యుత్ శాఖలో క్షేత్రస్థాయిలో వినియోగదారులకు సేవలు అందించాల్సిన అధికారులు తమ చేతికి ఆమ్యామ్యాలు అందితేనే పనిచేసే పరిస్థితి కనిపిస్తుంది. లేని పక్షంలో ఆ పనిని పట్టించుకోకుండా మూలన పడేస్తున్నారనే విమర్శలున్నాయి. విద్యుత్ శాఖకు డీడీలు కట్టి పని పూర్తి చేయాలని అధికారులు, కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోతుంది. 'సాక్షి' దృష్టికి వచ్చిన కొన్ని విషయాలే ఇందుకు నిదర్శనం. నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్న ఇలాంటివి క్షేత్రస్థాయిలో అనేకం ఉన్నట్లు తెలుస్తోంది.

పట్టింపులేనితనం..

విద్యుత్ వినియోగదారులు కొత్త మీటర్ బిగించాలని, అసౌకర్యాలు సవరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకుంటారు. దానికి సంబంధించి ఆ శాఖ ఎంత ఖర్చవుతుందనేది అంచనా వ్యయం రూపొందించి వినియోగదారుడికి సూచిస్తుంది. నిర్దేశిత వ్యయం చెల్లించిన తర్వాత పని పూర్తవుతుందని భావిస్తున్న వినియోగదారులకు ఆ శాఖ అధికారులు చుక్కలు చూపుతున్నారు. ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకున్నా ప్రయోజనం ఉండడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధుల ద్వారా ఫోన్ చేసినా ఈ శాఖ అధికారులు డోంట్‌కేర్ అనే పరిస్థితి ఉంది. తద్వారా తమ చెయ్యి తడిపితేనే పని అవుతుందనే భావనను వినియోగదారులకు కల్పిస్తున్నారు.

ఆర్టీఐలో అడిగినా..

విద్యుత్ శాఖ అధికారుల తీరుతో విసిగిన రిటైర్డ్ ఉద్యోగి విఠల్ ఆర్టీఐలో తనకు మీటర్లు ఎందుకు ఇవ్వడం లేదని, తన తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి ఎంత మందికి ఇచ్చారనే వివరాలు అడిగాడు. అయితే అప్పిలేట్ అథారిటీ నుంచి సరైన సమాధానం రాలేదని విఠల్ చెబుతున్నాడు. ఇదే విషయమై వరంగల్ అధికారులను సైతం సంప్రదించగా.. వారు ఆదిలాబాద్‌లోనే ఈ వ్యవహారం తేల్చుకోవాలని చెప్పారు. ఈ క్రమంలో హైదరాబాద్ అప్పిలేట్ అథారిటీకి ఫిర్యాదు చేయగా.. తాజాగా వారి నుంచి త్వరలోనే సమాధానం చెబుతామని మెసేజ్ రావడం గమనార్హం.

నా దృష్టికి వస్తే పరిష్కరిస్తా..



విద్యుత్ వినియోగదారులు తమ వర్క్స్‌కు సంబంధించి అసౌకర్యం ఎదురైతే నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాను. ఈ విషయంలో కింది స్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పనులు పెండింగ్‌లో లేకుండా చర్యలు చేపడతాను.

– సంపత్‌కుమార్, ఎస్ఈ, ఆదిలాబాద్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- ముందస్తు చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

ఆదిలాబాద్‌రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ, ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ, సంక్షేమ పథకాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో బుధవారం మావలలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వానాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని 468 గ్రామపంచాయతీల్లో పారిశుధ్య పనులను నిరంతరంగా కొనసాగించాలని సూచించారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించాలన్నారు. రోడ్లపై వర్షపు నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మురుగు కాలువలను శుభ్రం చేయాలన్నారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దోమలతో వ్యాప్తి చెందే డెంగీ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హరితహారంలో భాగంగా జిల్లాలో ఈ ఏడాది 25 లక్షల 5వేల మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఖాళీ స్థలాలు గుర్తించడం, గుంతలు తవ్వడం వంటి ఏర్పాట్లు చేసుకోవాలని, నాటిన ప్రతీ మొక్కను సంరక్షించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఈనెల 30 నుంచి 8,702 ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను పంపిణీ ఉంటుందన్నారు. అర్హులైన బీసీ చేతివృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రెండో విడత దళితబంధులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 1100 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక, శిక్షణ, అవగాహన కార్యక్రమాలను ఎంపీడీవోల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన, అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలన్నారు. సమగ్ర ఓటరు జాబితా తయారీకి బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం ఇటీవల జాతీయ జలశక్తి అవార్డు అందుకున్న కలెక్టర్‌ను అధికారులు సత్కరించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో గణపతి, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, డిప్యూటీ సీఈవో రాథోడ్ రాజేశ్వర్, ఎంపీడీవోలు, ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలే లక్ష్యం



మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తదితరులు

ఆదిలాబాద్‌టౌన్: పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు రాష్ట్రంలోని పది జిల్లాల్లో ఫాకో మిషన్లను వర్చువల్ విధానం ద్వారా బుధవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కంటి శుక్లాల ఆపరేషన్‌ను ఎలాంటి కట్టు లేకుండా చేయడానికి ప్రభుత్వం రిమ్స్‌కు ఫాకో పరికరం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, ఆర్ఎంవో చందు, వైద్యులు పాల్గొన్నారు.

బక్రీద్ ఏర్పాట్లు పరిశీలన

ఆదిలాబాద్: బక్రీద్ పర్వదినం పురస్కరించుకొని ప్రార్థనలకు వచ్చే వారి కోసం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానంలో ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. పండుగను సామరస్యపూర్వకంగా జరుపుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మోయిస్, మున్సిపల్ కమిషనర్ శైలజ, వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, తదితరులున్నారు.

క్రీడా పాఠశాల విద్యార్థుల సత్తా



బాక్సింగ్ క్రీడాకారులను సన్మానిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 17, 18 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన నిఖిల్ గౌడ్ (48 కేజీల విభాగంలో), బాలాజీ (52 కిలోల విభాగంలో) స్వర్ణ పతకాలు సాధించారు. జూలై 9 నుంచి 14వ రకు అరుణాచల్‌ప్రదేశ్ రాజధాని ఈటా నగర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు బాక్సింగ్ కోచ్ ఆనంద్ భాస్కర్ తెలిపారు. అలాగే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థిని సాయి ప్రణతి 48 కిలోల విభాగంలో కజకిస్తాన్‌లో నిర్వహించనున్న జూనియర్ ఏషియన్ బాక్సింగ్ చాంపియన్షిప్ ఇండియన్ క్యాంపునకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు క్రీడాకారులను హైదరాబాద్‌లో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఓఎస్డీ హరికృష్ణ, ఆర్కే బోస్, క్రీడాశాఖ అధికారులు తదితరులున్నారు.

మొక్కు 'బడి'!

- నామ్‌కే వాస్తేగా 'బడి బాట'
- ప్రైవేటుకే తల్లిదండ్రుల మొగ్గు
- సర్కారు పాఠశాలల వైపు పడని విద్యార్థుల అడుగులు
- ఉపాధ్యాయుల కొరత.. వసతుల లేమితోనేనా?

వివరాలు..
డీఈవో పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు :702
వీటిలో మొత్తం విద్యార్థుల సంఖ్య: 69,623
గతేదాది బడిబాటలో చేరిన విద్యార్థుల సంఖ్య : 6,560
ఈ ఏడాది బడిబాటలో చేరిన విద్యార్థుల సంఖ్య : 3,717



బడిబాట కార్యక్రమం చేపడుతున్న ఉపాధ్యాయులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఈ సారి చిన్నారుల అడుగులు సర్కారు బడి వైపు పడలేదు.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని చేపట్టింది. దాదాపు నెల పాటు ఈ కార్యక్రమం కొనసాగించినా ఆశించిన మేర ప్రయోజనం చేకూరలేనట్టు తెలుస్తోంది. బడిబయట పిల్లలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాల్సి ఉన్నప్పటికీ విద్యా శాఖాధికారుల అలసత్వమో, ఉపాధ్యాయుల నిర్లక్ష్యమేమో గానీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మాత్రం పెరగలేదు. చాలా మంది తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేట్‌లోనే చేర్పించారు. విద్యా శాఖాధికారుల లెక్కల ప్రకారం బడిబాటలో భాగంగా 3,717 మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చేరినట్లు చెబుతున్నారు. మరోవైపు ప్రైవేట్ యాజమాన్యాలు నెల పాటు జిల్లాలోని ఆయా గ్రామాల్లో తిరుగుతూ తల్లిదండ్రులను ఒప్పించి వారి పిల్లలను తమ పాఠశాలల్లో చేర్పించుకున్నారు. ఆ తర్వాత సర్కారు ఉపాధ్యాయులు గ్రామాల్లో నామ్‌కే వాస్తేగా బడిబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య పెరగకపోవడంతో జూలై 6వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని పొడిగించినట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రైవేటు వైపే మొగ్గు..

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేట్‌లోనే చేర్పించినట్లు తెలుస్తోంది. గతేదాది నుంచి ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టినా ఆశించిన ఫలితాలు రాకపోవడం గమనార్హం. 1,236 అంగన్‌వాడీ కేంద్రాల్లో దాదాపు 13వేల మంది చిన్నారులు 1వ తరగతిలో చేరాల్సి ఉండగా, ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 2,687 మంది మాత్రమే చేరారు. మిగతా వారంతా ప్రైవేట్‌లోనే చేరినట్లు తెలుస్తోంది. జిల్లాలో ఈసారి ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులు కేవలం 104 మంది ఉండగా, కొత్త అడ్మిషన్లు మరో 926నమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇక 6 నుంచి 14 ఏళ్లలోపు బడిబయట ఉన్న 225 మంది చిన్నారులను గుర్తించినట్లు చెబుతున్నారు. అయితే వీరిలో ఎంతమంది బడిలో చేరారనే సమాచారం విద్యా శాఖాధికారుల వద్ద లేకపోవడం గమనార్హం.

వెక్కిరిస్తున్న ఖాళీలతో..

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. మొత్తం 3,028 మంది ఉపాధ్యాయుల పోస్టులు ఉండగా, ఇందులో 577 ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయులు ఉన్నచోట విద్యార్థులు లేకపోవడం.. విద్యార్థులు ఉన్నచోట ఉపాధ్యాయులు లేని పరిస్థితి. ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలలు జిల్లాలో పది ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అలాగే దాదాపు ఒక్క ఉపాధ్యాయుడు లేని మరో పది వరకు పాఠశాలలు ఉండడం గమనార్హం. ఈ పాఠశాలలకు సమీపంలోని ఉపాధ్యాయులతో సర్దుబాటు చేసినా ఫలితం ఉండని పరిస్థితి.

మౌలిక వసతులు కరువు..

సర్కారు బడుల్లో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య పెరగడం లేదని తెలుస్తోంది. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న గ్రామాలతో పాటు దాదాపు 30 నుంచి 40కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల విద్యార్థులు సైతం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలకు వచ్చి చదువులు కొనసాగిస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి ప్రైవేట్ పాఠశాలల బస్సులు ఉదయం విద్యార్థులను తీసుకెళ్లి, సాయంత్రం వదిలేస్తున్నారు. దీంతోపాటు ఆటోల్లో సైతం విద్యార్థులను తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నా తల్లిదండ్రులు వారిని అక్కడ చేర్పించడం లేదు. తాగునీరు, మరుగుదొడ్లు, ఆటస్థలం, ఇతర మౌలిక వసతులు లేని కారణంగా మొగ్గు చూపడం లేదు. మన ఊరు–మనబడి కింద మొదటి విడతలో 237 పాఠశాలలను ఎంపిక చేసినా ఇందులో ఇప్పటి వరకు కనీసం 50శాతం కూడా పూర్తి కాలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఇట్టే తెలిసిపోతుంది.

పకడ్బందీగా బడిబాట..



బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడుతున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న, బడి బయట ఉన్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాం. తల్లిదండ్రులు పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి. మౌలిక వసతులతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకం అందిస్తున్నాం. బడిబాటలో భాగంగా ఇప్పటివరకు 3,717 మందిని చేర్పించడం జరిగింది. జూలై 6వరకు ఈ కార్యక్రమం చేపడతాం.

– ప్రణీత, డీఈవో

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని మైనార్టీ గురుకులాల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులకు గాను అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దుర్గం మ్యాన్‌పవర్ సొసైటీ చైర్మన్ శేఖర్ ప్రకటనలో తెలిపారు. టీజీటీ (మ్యాథమెటిక్స్, సోషల్, తెలుగు), పీజీటీ (బయోసైన్స్, సోషల్, తెలుగు, ఫిజికల్‌సైన్స్), జేఎల్ (ఫిజిక్స్, బాటనీ),స్టాఫ్‌నర్స్, సెక్యూరిటీ గార్డు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి ఈ నెల 29 నుంచి జూలై 2 వరకు సొసైటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 78422 82218, 99481 70670 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'సీఎం సభ' ఏర్పాట్లు వేగవంతం

ఆసిఫాబాద్: సీఎం కేసీఆర్ కుమురంభీం జిల్లా పర్యటనకు సంబంధించిన పనులు వేగవంతమయ్యాయి. ముఖ్యమంత్రి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్ నేతలు భారీ జనసమీకరణతోపాటు సభను విజయవంతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. ఆసిఫాబాద్‌లోని ప్రేమల గార్డెన్ పక్కన నిర్వహించే బహిరంగ సభాస్థలంలో ఎమ్మెల్సీ దండె విఠల్ బుధవారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.సాయంత్రం జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రభుత్వ విప్ సుమన్ పనులను పరిశీలించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు తదితరులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే కరీంనగర్ రేంజ్ డీఐజీ రమేశ్‌నాయుడు జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

క్లుప్తంగా

ట్రిపుల్‌ఐటీ వద్ద ఉద్రిక్తత



ఆప్ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ వద్ద బుధవారం ఉద్రిక్తత నెలకొంది. ఆప్ నాయకులు, కార్యకర్తలు క్యాంపస్‌లోకి వెళ్లేందుకు యత్నించారు. ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలపై మెమోరాండం ఇచ్చేందుకు లోనికి వెళ్లేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. అనంతరం వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కేటీఆర్‌ను కలిసిన వీసీ



కేటీఆర్‌తో మాట్లాడుతున్న వీసీ

భైంసా: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను బాసర ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఇటీవల వర్సిటీలో ప్రగతిదినోత్సవం, వర్సిటీ ప్రగతి వివరాలను మంత్రికి వివరించారు. చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలపై చర్చించారు. అలాగే విద్యార్థులు, ఉద్యోగులు రూపొందించిన త్రీడీ ప్రింటింగ్‌పై మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని, వర్సిటీ అభివృద్ధికి సహాయసహకారాలు అందిస్తానని మంత్రి పేర్కొన్నట్లు వీసీ తెలిపారు.

కేయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 30న జరగాల్సిన డిగ్రీతో సహా ఇతర పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ బుధవారం తెలిపారు. జూలై 1న గ్రూప్–4 పరీక్ష ఉన్నందున ఈనెల 30న జరగాల్సిన పరీక్షలన్నీ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఆయా పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత వెల్లడిస్తామని తెలిపారు. మిగతా పరీక్షలు టైంటేబుల్ ప్రకారమే జరుగుతాయని ప్రకటించారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉమ్మడి జిల్లాలో జరిగిన పరీక్షల్లో నలుగురు విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ డిబార్ అయ్యారని పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలో రెబ్బెనలో ఒకరు, ఇచ్చోడలోని సాయిసమత డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని వివరించారు.

ఎడ్లబండిని ఢీకొని ఒకరి మృతి

కుభీర్: మండలంలోని అంతర్ని వద్ద బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో రోడ్డు పక్కనే గల ఎడ్లబండిని బైక్‌తో ఢీకొని సానారి గ్రామానికి చెందిన దొడ్డిక్రొంది వెంగళ్‌రావు (48) మృతిచెందాడు. మాలేగాం నుంచి స్వగ్రామమైన మాలేగాం గ్రామానికి వస్తుండగా రోడ్డుపక్కన ఉన్న ఎడ్లబండిని ప్రమాదవశాత్తు ఢీకొట్టగా తీవ్ర గాయాలై మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ విషయమై ఎస్సై ఎండీ.షరీఫ్‌ని ప్రశ్నించగా ప్రమాదం జరిగింది వాస్తవమేనని, దీనిపై ఫిర్యాదు రాలేదని తెలిపాడు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు బక్రీద్ పర్వదినం
- మసీదులు, ఈద్గాలు ముస్తాబు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు



ఆదిలాబాద్ ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

నెన్నెల/ఉట్నూర్‌రూరల్/కెరమెరి: హజరత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ముస్లింలు నిర్వహించుకుంటారు. దీనినే ఈద్ ఉల్ జుహా అని కూడా అంటారు. ఇస్లాం క్యాలెండర్‌లోని బక్రీద్ మాసంలో 11వ రోజున పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇస్లాం మానవాళికి నిర్దేశించిన విధి విధానాల్లో ఐదో విధి మక్కా యాత్ర చేయడం, జంతువులను బలి ఇచ్చి మాంసాన్ని పేదలకు పంచడం, రెండు రకాతులుగా నమాజ్‌లు ఆచరించడం ఈ పండుగ ప్రత్యేకత. గురువారం బక్రీద్ పండుగ నమాజ్ కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, మసీదులు ముస్తాబు చేశారు. ఆదిలాబాద్‌లోని ఈద్గా వద్ద ఎమ్మెల్యే రామన్న, ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

ఖుర్బానీ తప్పనిసరి

ఇబ్రహీం త్యాగనీరతిని మెచ్చి బక్రీద్ పండుగ రోజు జంతుబలి ఇవ్వాలని, ఈ విధానాన్ని ప్రళయం వరకు కొనసాగించాలని నిర్దేశించినట్లు ఇస్లాం చెబుతోంది. ఎవరి వద్దయితే యాభైరెండున్నర తులాల వెండి.. ఏడున్నర తులాల బంగారం లేదా ఆ మేరకు డబ్బు ఉంటుందో వారిపై ఖుర్బానీ తప్పనిసరి అవుతుంది. ఈ మేరకు ముస్లింలు బక్రీద్ రోజున పెద్ద ఎత్తున జంతువులను బలి ఇచ్చి మాంసాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పేదలకు సమభాగాలుగా పంపిణీ చేస్తారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గొర్రెలు, మేకల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి.

ప్రత్యేక ప్రార్థనలు

ముస్లింలు ఈద్ నమాజ్‌లు ఊరిబయట మైదానంలోని ఈద్గాల్లో చేయాలని నియమం. నమాజ్ ఆచరణకు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఈద్గాలకు వెళ్లలేని తరుణంలో సమీప మసీదుల్లో నమాజ్ చేయనున్నారు.

బక్రీద్ రోజున మక్కా యాత్ర

ఇస్లాం విధి విధానాల్లో ఐదో విధానమైన హజ్(మక్కాయాత్ర) ఇదే రోజున మక్కాలో జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది ముస్లింలు మక్కా మసీదులోని కాబా దర్శనం చేసుకుంటారు. 40 రోజుల హజ్ యాత్రలో భాగంగా మక్కా మదీనాల్లో నమాజ్ ఆచరిస్తూ శైతాన్‌కు రాళ్లు వేసే ప్రక్రియలో పాల్గొంటూ దైవారాధనలో గడుపుతారు.

మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు



ముస్లింలు అల్లా ఆదేశాలను పాటిస్తూ పండుగ వేడుకలు జరుపుకుంటారు. వర్షాకాలం దృష్ట్యా వర్షాలు కురుస్తుండటంతో ఈద్గాల వద్ద సౌకర్యాలను బట్టి నమాజ్ చేయడం జరుగుతుంది. వర్షం వల్ల ఆటంకాలు వస్తే తమ తమ సమీప మసీదుల్లో నమాజ్ చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. పండుగను శాంతియుత వాతావరణంలో కుటుంబ సమేతంగా సుఖసంతోషాలతో జరుపుకోవాలి.

– కలీం, మౌలానా జామా మసీద్, ఉట్నూర్

వరదొచ్చేదాకా చూస్తారా?



కౌంటర్ వెయిట్‌ను తయారు చేస్తున్న సిబ్బంది

- వానాకాలం సీజన్ ప్రారంభం..
- పూర్తికాని కడెం మరమ్మతులు
- ఈ ఏడాది ప్రాజెక్ట్ నిర్వహణకు ఇబ్బందులేనా?



పనులు పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు(ఫైల్)

కడెం: గత ఏడాది జూలైలో వచ్చిన భారీ వరదలకు కడెం ప్రాజెక్ట్ దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఏడాది కావస్తున్న నేటికీ కడెం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి మరమ్మతులు పూర్తి కాలేదు. గత ఏడాది వానాకాలం వచ్చిన వరదల గుణపాఠం నేర్వని ప్రాజెక్ట్ అధికారులు ఈ ఏడాది వానాకాలం సీజన్‌కు సిద్ధంగా ఉన్నామని చెప్పడం గమనార్హం.

ప్రాజెక్ట్ నిర్వహణకు ఇబ్బందులే...

గత ఏడాది కడెం ప్రాజెక్ట్‌కు వచ్చిన భారీ వరదల కారణంగా ప్రాజెక్ట్ 2, 3 నంబర్ వరద గేట్ల కౌంటర్ వెయిట్‌లు కొట్టుకుపోయాయి. వాటి స్థానంలో కొత్త కౌంటర్ వెయిట్‌లను అమర్చేందుకు నెలరోజులుగా ప్రాజెక్ట్ వద్దే సిబ్బంది పనిచేస్తున్నారు. ఒక వరద గేటుకు కౌంటర్ వెయిట్‌ను అమర్చిన దాంట్లో బరువు కోసం కంకర రాయి నింపాలి. రెండోవ నంబర్ వరద గేటుకు అమర్చాల్సిన కౌంటర్ వెయిట్ తయారు కాలేదు. ఇటీవలే కడెం ప్రాజెక్ట్‌ను పరిశీలించిన ఈఎన్‌సీ బృందం జూన్ 10 నాటికి కౌంటర్ వెయిట్, ఇతర మరమ్మతులు పూర్తి చేయిస్తామని తెలిపారు. గడువు ముగిసిన ఇంకా పనులు పూర్తి కాలేదు. గత నెలలో ప్రాజెక్ట్ మరమ్మతులకు ప్రభుత్వం 1.44 కోట్ల నిధులను విడుదల చేసింది. రెండు సార్లు టెండర్ పిలిచినా ప్రక్రియ పూర్తికాకపోవడంతోనే పనులు పూర్తి కాలేదని అధికారులు పేర్కొంటున్నారు. రాత్రికి రాత్రే పూర్తిగా నిండే చరిత్ర కడెం ప్రాజెక్ట్‌ది. అలాంటిది వానాకాలం సీజన్ ప్రారంభమైన ఇంకాను మరమ్మతులు పూర్తి కాకపోవడంతో గత ఏడాది ప్రాజెక్ట్ వచ్చిన భారీ స్థాయి వరదలు వస్తే చేతులు ఎత్తేయడమే తప్ప మారోమార్గం లేదు.

మోరాయింపు తప్పేనా?

కడెం ప్రాజెక్ట్ ఎఫ్‌ఆర్‌ఎల్ (ఫుల్ రిజర్వాయర్ లెవెల్) 700 (7.603టీఎంసీ)అడుగులు కాగా, గత ఏడాది నీటిమట్టాన్ని 700 అడుగులు మించి సుమారు ఆరు లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. పూర్తిస్థాయి 18 వరద గేట్లు ఎత్తితే..ప్రాజెక్ట్ నుంచి సుమారు మూడు లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయచ్చు. భారీగా ఇన్‌ఫ్లో వచ్చిన సమయంలో గేట్లు మొరాయిస్తే ఇబ్బందులు తప్పవు. అయితే అన్ని వరద గేట్లు పనిచేస్తున్నాయా, లేదా ట్రయల్ రన్ చేయక ముందే, అన్ని గేట్లు ఆపరేటింగ్ సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 27న సీఈ శ్రీనివాస్ ప్రాజెక్ట్ 5వ నంబర్ వరద గేటు ట్రయల్ రన్ చూసి వెళ్లిపోయారు. అన్ని గేట్లు పరిశీలిస్తే లోపాలు బయటపడేవి. గేట్లకు పూర్తి మరమ్మతులు చేపట్టకపోవడంతో.. ఈ ఏడాది కూడా గేట్ల మొరాయింపు తప్పదనేది సమాచారం.

పనులు కొనసాగుతున్నాయి

ప్రాజెక్ట్ 3వ నంబర్ వరద గేటు కౌంటర్ వెయిట్ బిగించాం. రెండవ నంబర్ వరద గేటు కౌంటర్ వెయిట్‌ను త్వరలోనే వరద గేటుకు బిగిస్తాం. టెండర్ ప్రక్రియ పూర్తి కాక, పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టలేదు. ప్రాజెక్ట్ నిర్వహణకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– బోజదాసు, డీఈ, కడెం ప్రాజెక్ట్

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య



విలాస్(ఫైల్)

భైంసారూరల్: మండలంలోని టాక్లి గ్రామానికి చెందిన మోటేరావు విలాస్ (37)ఉరేసుకుని బుధవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.... విలాస్ వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా తాగుడికి బానిసయ్యాడు. దీంతో అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అంజలి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.


ఆదిలాబాద్‌లో మరొకరు...



రాజమౌళి (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన పరికి పండ్ల రాజమౌళి(42) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ వివరాల ప్రకారం.. గతకొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆ బాధను భరించలేక బుధవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు బలవన్మరణం



శీల సునీల్(ఫైల్)

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన శీల సునీల్(40) ఆర్థిక ఇబ్బందులు తాళలేక బుధవారం వేకువ జామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. సునీల్ యాసంగిలో తనకున్న రెండెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. హార్వెస్టర్‌తో నూర్పిడి చేసేందుకు ఉంచిన మొక్కజొన్న పంట మే 16న విద్యుదాఘాతంతో కాలిపోయింది. దీంతో రూ. లక్షా 70వేల వరకూ నష్టం వాటిల్లింది. రూ.3లక్షల వరకు అప్పులయ్యాయి. ప్రస్తుతం రెండెకరాల్లో సోయాపంట సాగు చేసేందుకు సిద్ధమయ్యాడు. అప్పులు తీర్చలేనేమోనన్న బెంగతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సునీల్ కూతురు భాగ్య ఇటీవలే ఇంటర్ పూర్తి చేసింది. కుమారుడు ధనుంజయ్ ఆదిలాబాద్ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. మంగళవారం కుమారుడిని పాఠశాలలో చేర్పించి వచ్చాడు. భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మండ్లు పేర్కొన్నారు.

అదనపు కట్నం కేసు నమోదు

బెల్లంపల్లి: అదనపు వరకట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడిన భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు బుధవానం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. కన్నాల బస్తీకి చెందిన కుశ్నపల్లి హర్ష ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రానికి చెందిన కోమిడి ప్రవీణ్‌తో గత ఫిబ్రవరి నెలలో పెళ్లి చేశారు. పెళ్లైన నుంచి అదనపు కట్నం కోసం వేధించేవారు.

యువకుడి ఆచూకీ లభ్యం



భోపాల్ రైల్వే పోలీసులతో యువకుడు

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన బట్టి నవీన్(35) ఈ నెల 15న తన అత్తమ్మను పంజాబ్ రాష్ట్రంలో ఉంటున్న బంధువుల ఇంట్లో దింపి తిరిగి 20వ తేదీన పంజాబ్‌లోని గంగానగర్ ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుండగా భోపాల్ వద్దకు రాగానే చివరిసారి ఇంటికి ఫోన్ చేసి మాట్లాడాడు. అప్పటి నుంచి ఫోన్ స్విచ్చాఫ్ రావడం, ఇంటికి తిరిగిరాకపోవడంతో యువకుడి భార్య పుష్పలత గత శనివారం స్థానిక నర్సాపూర్ (జి) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. యువకుడి స్నేహితులు భోపాల్ పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసులు నమోదు చేశారు. యువకుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఝూన్సీ రైల్వే స్టేషన్లో ఆచూకీ లభించడంతో భోపాల్ రైల్వే పోలీసులకు అప్పగించారు. నర్సాపూర్(జి) మండల కేంద్రం నుంచి వెళ్లిన యువకుడు స్నేహితులకు భోపాల్ రైల్వే పోలీసులు అతడిని అప్పగించారు.

మద్యానికి బానిసై బాలుడి ఆత్మహత్య

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సత్యసాయినగర్ కాలనీకి చెందిన బాలుడు మద్యానికి బానిసై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ వివరాల ప్రకారం... శివసాయి(16) కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినకుండా మద్యం సేవించేవాడు. మంగళవారం సైతం అతిగా మద్యం తాగి రాగ కుటుంబ సభ్యులు మందలించడంతో రాత్రి ఇంటి ఆవరణంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి రామ్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాకు రూ.82.86కోట్లు

- ప్రత్యేక రుణ సాయానికి కేంద్రం ఆమోదం
- వైద్యం, రోడ్డు రవాణా మెరుగు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం అందించనున్న మూలధన పెట్టుబడుల వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రూ.82.86కోట్ల రుణాలకు ఆమోదం తెలిపింది. 2023–24ఆర్థిక సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలకు మూలధన వ్యయాన్ని అందించేందుకు 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్' పథకం ద్వారా 50ఏళ్ల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వనుంది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం రూ.2,102 కోట్ల మూలధన పెట్టుబడుల ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదించింది. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి వైద్యం, రహదారి ప్రాజెక్టులకు రుణం మంజూరు కావడంతో ఆ మేరకు అభివృద్ధి జరగనుంది. ఆమోదించిన ప్రాజెక్టుల్లో ఆసిఫాబాద్‌లోని జిల్లా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిలో వంద ఎంబీబీఎస్ సీట్ల కల్పన కోసం రూ.9.50కోట్లు, నిర్మల్ జిల్లా ఆసుపత్రి అప్‌గ్రేడ్ కోసం రూ.10కోట్లు, ఆదిలాబాద్ రిమ్స్ పరిధిలో కొత్తగా నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు రూ.20కోట్లు, మంచిర్యాల జిల్లా చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రం 30నుంచి వంద పడకల అప్‌గ్రేడ్ కోసం రూ.10కోట్లు రుణ మంజూరుకు కేంద్రం ఆమోదించింది. నిర్మల్ పట్టణంలో జాతీయ రహదారి 61నుంచి సింగిల్ రోడ్డును నాలుగు వరసలుగా మార్చి, ఎల్లపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వరకు రోడ్డు విస్తరించి నిర్మించేందుకు రూ. 27.57కోట్లు, ఆదిలాబాద్ నుంచి ఇంద్రవెల్లి దాకా, వయా అంకోలి, వాన్వట్, పిప్పల్‌ధరి, కందాల, చిచ్‌ధరి, మీదుగా బుర్సన్‌పటార్ వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.5.79కోట్లు రుణ మంజూరుకు కేంద్రం ఆమోదించింది. మొత్తంగా స్పెషల్ అసిస్టెన్స్ లోన్ కింద ఉమ్మడి జిల్లాకు ఆమోదించిన రూ.82.86కోట్ల ఈ మూలధన వ్యయంతో వైద్య, రోడ్డు రవాణా పరంగా అభివృద్ధి జరిగే అవకాశం ఉంది.

పరారీలోని దొంగను పట్టుకున్న పోలీసులు



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఓ దొంగను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య వివరాల ప్రకారం... బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి ధనలక్ష్మి, తాళ్లపల్లి ప్రసాద్ భార్యభర్తలు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రిపూట ఇనుపరాడ్‌తో చాకచక్యంగా తాళం పగులగొట్టి దొంగతనాలకు పాల్పడటం వృత్తిగా పెట్టుకున్నాడు. ధనలక్ష్మి గత ఏప్రిల్ 29న బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రి పక్కన ఉన్న క్వార్టర్స్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆమెను అదుపులోకి తీసుకుని విచారించారు. ధనలక్ష్మిపై కేసు నమోదు చేసి రెండు నెలల క్రితం కోర్టుకు పంపించారు. ఆమె భర్త ప్రసాద్ పరారీలో ఉన్నాడు. మంగళవారం రాత్రి ప్రసాద్‌ను బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్‌వద్ద పట్టుకుని కోర్టులో హాజరుపరిచారు.

భూ వివాదంలో ఇద్దరి దారుణ హత్య

- 13 మంది నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ నరేందర్, ఎస్సై భూమేశ్



అరెస్టు చూపిస్తున్న సీఐ నరేందర్, ఎస్సై భూమేశ్

రెబ్బెన(ఆసిఫాబాద్): భూవివాదంలో ఇద్దరిని హత్య చేసిన 13 మందిని పట్టుకున్నట్లు సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్ వెల్లడించాడు. వారి వివరాల ప్రకారం... గత సోమవారం జక్కులపెల్లి శివారులోని వ్యవసాయ భూమి విషయంలో మండల బక్కయ్య కుటుంబీలకు, మండల మెంగయ్య కుటుంబీలకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. గత ఆదివారం బక్కయ్య కుటుంబ సభ్యులు అదే భూమిలో పత్తి విత్తనాలు వేశారు. విషయం తెలుసుకున్న మెంగయ్యతో పాటు అతడి కుటుంబ సభ్యులు సోమవారం మధ్యాహ్నం కత్తులు, గొడ్డళ్లు, రాళ్లు, కారంపొడితో భూమి వద్దకు వెళ్లారు. వారి రాకకు గమనించి బక్కయ్య అడ్డుకునే ప్రయత్నం చేశాడు. వారు వెంట తెచ్చుకున్న కర్రలు, కత్తులు, గొడ్డళ్లతో దాడి చేయగా బక్కయ్య కుమారుడు మండల నర్సయ్యతో పాటు అతడి సోదరి గిరుగుల బక్కక్క అక్కడికక్కడే మృతి చెందారు. మరికొంత మందికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. మండల ఇందిరా ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నాలుగు బృందాలతో ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టి పరారీలోని 13మందిని అదుపులోకి తీసుకున్నారు. దాడికి ఉపయోగించిన మూడు గొడ్డళ్లు, రెండు కత్తులు, నాలుగు కర్రలను స్వాధీనం చేసుకున్నారు. మండల మల్లేష్, మండల గణేష్, మండల వెంకటేష్, గిరుగుల భీంరావు, గిరుగుల రాకేష్, మండల రంగక్క, గిరుగుల రజిత, మండల రజిత, మండల రుక్మ, రాటే భూమక్క, రాటే భూదయ్య, గిరుగుల దుర్గక్క, గిరుగుల సొమ్మలను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్ వీధిలో నివాసముంటున్న న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు ఇంట్లోని స్టోర్‌లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధమైంది. సతీశ్‌బాబు దంపతులు నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు వెంటనే వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు చేరుకొని తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



చోరికి పాల్పడిన నిందితులతో పోలీసులు

తిర్యాణి: ఈనెల 26న మండల కేంద్రంలోని సహకార బ్యాంక్‌లో చోరీకి యత్నించడంతో పాటు మండల కేంద్రానికి చెందిన సకారం అనే వ్యక్తి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవపూర్ గ్రామానికి చెందిన సామ రాకేశ్‌రెడ్డి, తిర్యాణి మండలం గిన్నెదరి గ్రామానికి చెందిన గేడం శ్రీనివాస్ అనే ఇద్దరూ మిత్రులు ఈ నెల 26న మంచిర్యాలలో కలుసుకుని మద్యం సేవించారు. అనంతరం ఈజీగా మనీ సంపాదించాలనే ఉద్దేశంతో చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. రాత్రి 9 గంటల సమయంలో మండల కేంద్రానికి చేరుకుని, రాత్రి 11:30 గంటల సమయంలో సహకార బ్యాంకు లూటి చేసేందుకు యత్నించగా డబ్బులు భద్రపర్చిన లాంకర్‌లు తెరుచుకోకపోవడంతో ఎదురుగా ఉన్న సకారం అనే వ్యక్తి కి చెందిన ఇంటికి తాళం వేసి ఉండడాని గమనించి ఇంట్లోకి చొరబడి రెండు తులాల బంగారంతో పాటు రూ.12వేల నగదును దొంగిలించారు. బుధవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించగా కన్నెపెల్లి బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

మోసపోయిన యువకుడు

- వాట్సాప్ గ్రూపు మెస్సెజ్‌తో మోసం..

బెల్లంపల్లి: వాట్సాప్ గ్రూపు మెస్సెజ్‌కు స్పందించి బెల్లంపల్లికి చెందిన ఓ యువకుడు మోసపోయిన వైనం బుధవారం వెలుగు చూసింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య కథనం ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి పోస్టాఫీసు బస్తీలో నివాసం ఉంటున్న రాకేష్ పాండే అనే యువకుడు ఇండియన్ పోస్టు పేమెంట్ వాట్సాఫ్ గ్రూపులో యాడ్ అయ్యాడు. ఇటీవల ఆ గ్రూపులో గుర్తు తెలియని వ్యక్తి యూఎల్‌సీ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు సదరు వాట్సాఫ్ గ్రూపులో మెస్సెజ్‌ను పోస్టుచేశాడు. ఆ మెస్సెజ్‌కు స్పందించిన రాకేష్ పాండే సదరు వ్యక్తికి ఫోన్‌చేసి తనకో యూఎల్‌సీ కేంద్రం కావాలని అభ్యర్థించాడు. ఇందుకు సదరు వ్యక్తి డబ్బులు చెల్లించాలని చెప్పడంతో రాకేష్ రూ.13,001 పే చేశాడు. ఆ తర్వాత మళ్లీ రూ.9వేలు చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తి కోరడంతో అనుమానం వచ్చి రాకేష్ ఆరా తీసి మోసపోయినట్లు గ్రహించాడు. ఈ ఘటనపై బుధవారం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని భార్య మృతి

బెల్లంపల్లి: కట్టుకున్న భర్త కాపురానికి తీసుకెళ్లడం మనస్తాపానికి గురైన ఓ మహిళ అనారోగ్యం పాలై మృతిచెందింది. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య కథనం ప్రకారం.... బెల్లంపల్లి భూదిద గడ్డ బస్తీకి చెందిన ఆయిళ్ల విజయ, మల్లేష్ దంపతుల కుమార్తైను చైతన్యను 2017లో వైజాగ్‌కు చెందిన కవ్వంపల్లి నరేష్‌తో పెళ్లి చేశారు. పెళ్లైన రెండు నెలల తరువాత అదనపు కట్నం రూ.2లక్షలు తీసుకురావాలని భర్త, అత్తమామ లక్ష్మి, మల్లయ్యలు వేధించి ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. పుట్టింటికి వచ్చిన చైతన్య భర్త కాపురానికి తీసుకెళ్లకపోవడంతో తీవ్ర మానసిక వేదనతో అనారోగ్యం పాలై ఇటీవల మృతిచెందింది. బుధవారం మృతురాలి తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.